క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా వెంకన్న



నియామకపత్రాన్ని అందిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లేటి లక్ష్మణ్

చివ్వెంల : ఎమ్మార్పీఎస్ టీఎస్ చివ్వెంల మండల ప్రధాన కార్యదర్శిగా మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామానికి చెందిన పల్లేటి వెంకన్నను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లేటి లక్ష్మణ్ ఆదివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడారు. తన ఎంపికకు సహకరించిన మండల, జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా గ్రామశాఖ అధ్యక్షుడిగా పల్లేటి సుధీర్‌ను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. కార్యక్రమంలో మామిడి యల్లయ్య, సైదులు, సాగర్, ప్రణయ్, గోవర్ధన్, వినయ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీలో చేరిక

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు ఆదివారం ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ సమక్షంలో హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో డీఎస్పీలో చేరారు. పార్టీలో చేరిన బెల్లి వీరయ్యయాదవ్, పాక స్వప్న, గైగుళ్ల నిరంజన్, రావుల వినయ్‌లకు విశారదన్ మహారాజ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రసాల వినోద్ యాదవ్, సూర్యాపేట జిల్లా కన్వీనర్ సీహెచ్ కిరణ్‌కుమార్, నాగారం మండల అధ్యక్షుడు చిప్పలపల్లి నాగార్జున, విజయరామరాజు, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఏకాంబరేశ్వర స్వామి ఊరేగింపు

నాగారం : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో భక్తులు ఆదివారం రాత్రి శ్రీఏకాంబరేశ్వరస్వామిని ఆశ్వ వాహనంపై గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం భక్తులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజ లు చేశారు. కార్యక్రమంలో అర్చకులు కాశీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ బోయిని శోభలింగమల్లు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

నాగారం : తాటి చెట్టు పైనుంచి పడి ఓ గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఈటూరులో చోటుచేసుకుంది. నాగారం మండల పరిధిలోని ఈటూరు గ్రామానికి చెందిన మొగుళ్ల అంజయ్య తన రోజు వారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం తాటి చెట్టు ఎక్కడానికి వెళ్లాడు. తాటిచెట్టుపైకి ఎక్కి కల్లు గీసి కిందకి దిగుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారడంతో కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అంజయ్యకు కుడికాలు ఎముక, ఎడమ చెయ్యి విరగడంతో పాటు తలకు గాయమైంది. బాధితుడిని చికిత్స నిమిత్తం సూర్యాపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

అర్వపల్లి : రాష్ట్రంలోని తొలి సూర్యక్షేత్రమైన తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. సంక్రాంతి పర్వదినంతో క్షేత్రంలో భక్తులు కిటకిటలాడారు. మధ్యాహ్నం అన్నప్రసాద సత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా భోగి వేడుకలు

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని గ్రామాల్లో ఆదివారం ప్రజలు భోగి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో ప్రజలు భోగి మంటలు వేశారు. మహిళలు ఇళ్ల ఎదుట ఉదయాన్నే రంగురంగుల ముగ్గులు వేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. పతంగులు ఎగురవేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పెన్‌పహాడ్ : నాగులపహాడ్‌లో భోగి మంటలు వేస్తున్న గ్రామస్తులు



నాగారంలో ముగ్గు వేస్తున్న చిన్నారులు



కొత్తగూడెంలో ముగ్గు వేస్తున్న చిన్నారి



నూతనకల్‌లో భోగి మంటలు వేస్తున్న యువకులు



అర్వపల్లి : గుంటూరుకు చెందిన కళాకారులతో గ్రామస్తులు



నాగారం : వర్ధమానుకోటలో భోగి మంటలు వేస్తున్న యువత



నాగారంలో భోగి మంటలు వేస్తున్న యువత



తిరుమలగిరిలో భోగి మంటలు కాగుతున్న యువకులు



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో కళాకారుల నృత్యప్రదర్శన



అర్వపల్లిలో పతంగులు ఎగురవేస్తున్న చిన్నారులు



తుంగతుర్తి : కొత్తగూడెంలో భోగి మంటలు వేస్తున్న యువకులు

అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి

నూతనకల్ : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ బీఆర్ఎస్ నాయకులకు అనుకూలంగా ఉంటున్నాడని చేస్తున్న అబద్ధపు ప్రచారాలను బీఆర్ఎస్ నాయకులు మానుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఓటమిని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ ఐక్యతను దెబ్బతీయడం కోసమే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం ఆదివారం రూ. 5,016 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అతడిని సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు.

శబరికి తరలిన మాలధారులు

తిరుమలగిరి : మండల కేంద్రానికి చెందిన పలువురు అయ్యప్పస్వామి మాలధారులు 41 రోజులు మాలధారణ చేసి ఆదివారం శబరికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని విఘ్నేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శబరికి వెళ్లిన వారిలో గురు స్వాములు శేఖర్, శ్రీధర్, గంగాధర్, మోహన్‌బాబు, చిరంజీవి, మహేష్, తదితరులు ఉన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలు

అర్వపల్లి : మండలంలోని తిమ్మాపురంలో నూతనంగా నిర్మించిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం ఉత్సవాలు నిర్వహించున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గణపతి పూజ, స్వామి అభిషేకం, కుంకుమార్చనలు, స్వామి ఆరాధన పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే గ్రామంలో స్వామి ఊరేగింపు ఉంటుందని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

నిత్యావసరాల పంపిణీ

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో సంక్రాంతిని పురస్కరించుకొని ఆదివారం నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ పట్టణ ఉపాధ్యక్షుడు, 6వ వార్డు ఇన్‌చార్జి చింతకాయల సుధాకర్, ప్రవీణ్, సంపత్, ప్రకాష్, కుమార్, ప్రశాంత్, మహేష్, సైదులు, నరేష్ పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



మాచిరెడ్డిపల్లిలో బహుమతులు ప్రదానం చేస్తున్న సర్పంచ్ పసుపులేటి ప్రేమలత

నాగారం : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మాచిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పసుపులేటి ప్రేమలతవెంకట్‌రెడ్డి మాట్లాడారు. తెలుగు జాతి ఔన్నత్యాన్ని చాటేందుకు ముగ్గుల పోటీలు ఎంతో దోహదపడుతాయన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు పుష్ప ల్యాబ్ యజమాని వడ్డే మధు సహకారంలో బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సోమిరెడ్డి, లింగమల్లు, వాసు, ముత్తయ్య, వెంకన్న, మధు, యాదగిరి, ఉప్పలయ్య పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ముగ్గులు

తుంగతుర్తి : సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ముగ్గులని కాంగ్రెస్‌పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి సత్యనారాయణ, రాంబాబు, గంగరాజు. మహిళలు తదితరులు పాల్గొన్నారు

బహుమతుల ప్రదానం

మద్దిరాల : గోరెంట్ల గ్రామంలో ఆదివారం ముగ్గుల పోటీలు, కబడ్డీ, స్కిప్పింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు చల్లా తేజ, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, ప్రదీప్‌కుమార్, గ్రామ అధ్యక్షుడు కంభం పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



పర్సాయపల్లిలో అక్షింతల శోభాయాత్ర



నాగారం : మాచిరెడ్డిపల్లిలో..

అర్వపల్లి : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను పర్సాయపల్లిలో ఆదివారం గ్రామస్తులు, భక్తులు ఇంటింటికీ శోభాయాత్రగా వెళ్లి పంపిణీ చేశారు. ఈ నెల 22న పండుగ వాతావరణంలో ప్రజలు ఇళ్లలో దీపాలు వెలిగించి పూజలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కుంభం యాకస్వామి, కొత్రపిడత సంతు, మర్రిపెల్లి సురేందర్, బి. శ్రీకాంత్, పి.సోమయ్య, పుప్పాల నర్సింహారావు, షేను భానుచందర్, కె.శ్రీకాంత్, భక్తులు పాల్గొన్నారు.

నాగారం : అయోధ్యలో ఈ నెల 22న జరిగే రామ మందిరం ప్రారంభోత్సవం, శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా పంపిణీ చేస్తున్న అయోధ్య రాముడి అక్షింతలను ధర్మ జాగరణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మాచిరెడ్డిపల్లి, పేరబోయినగూడెం గ్రామాల్లో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కాశీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ పుసుపులేటి ప్రేమలతవెంకట్‌రెడ్డి, భక్తులు లింగమల్లు, సోమిరెడ్డి, ముత్తయ్య, వాసు, వెంకన్న, మధు, యాదగిరి, ఉప్పలయ్య, సత్తయ్య, సతీష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల పరిధిలోని కర్విరాల గ్రామంలో అయోధ్య రాముడి అక్షింతలను గ్రామస్తులు ఆదివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెలుగు వెంకన్న, పూజారి చెన్న బోయిన వెంకన్న, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : చందుపట్ల గ్రామంలో ఆదివారం అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కస్తూరి రాణి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా గోదాదేవి కల్యాణం



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఆత్మకూర్ (ఎస్) : చెన్నకేశవస్వామి ఆలయంలో..



తుంగతుర్తిలో..

అర్వపల్లి : ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అలాగే కొమ్మాలలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో కూడా గోదాదేవి కల్యాణం జరిపారు. కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, కె.వరదాచార్యులు, యోగానందదీక్షితులు, దరూరి జగన్నాధాచార్యులు, ఈఓలు వై. శ్రీనివాసరెడ్డి, కుశలయ్య, జూనియర్ అసిస్టెంట్ పి.శ్రీనివాసరెడ్డి, భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : ధనుర్మాసోత్సవాల ముగింపు సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం శ్రీభూగోదాదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాదేవి గోష్టి బృందం సభ్యులు కోలాటాలతో అలరించారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, వెంకటరంగాచార్యులు, రమాకాంతాచార్యులు, శ్రీకాంత్, అనువంశికధర్మకర్తలు సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, రామరాజు శ్యాంసుందర్ రావు, రామరాజు రవిచందర్‌రావు, చిలుముల రాంరెడ్డి, చందా క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తిలోని ఆలయంలో..

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలోని శ్రీపట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణాన్ని ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గోదాదేవి, రంగనాథ స్వాముల ఉత్సవ విగ్రహాల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి, వడి బియ్యం పోశారు. సాయంకాలం వేళ అమ్మవార్ల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో కైకర్యం నిర్వహించడం కోసం భక్తులు చిత్తలూరి రాంమూర్తి-మల్లేశ్వరి రూ.10,000 విరాళం అందజేశారు. సామ వెంకన్న -కృష్ణకుమారి దంపతులు ప్రసాదాల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కాటూరి రామాచార్యులు, శేషశర్మ, సర్పంచ్ సంకినేని స్వరూపరవీందర్, ఆలయ చైర్మన్ వెంకన్న, భక్తులు దయాకర్, మల్లయ్య, వెంకట్రామనర్సయ్య పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

ఆత్మకూర్ (ఎస్) : పేదల కోసం ఉద్యమించిన అమరుల త్యాగాలను ఆదర్శంగా తీసుకొని నేటి యువత ఉద్యమించాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతుకూలీ సంఘం పోరాట సమితి జిల్లా నాయకుడు బత్తుల గురువయ్య అన్నారు. సీపీఐ ఎంఎల్ జనశక్తి గ్రామ శాఖ అధ్యక్షుడు మున్నా సైదులు ఆధ్వర్యంలో ఆదివారం రామన్నగూడెంలో జనశక్తి నాయకులు అరుట్ల వెంకటరెడ్డి, అరుట్ల శంకర్‌రెడ్డిల ఫొటో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాచకొండ మల్లయ్య, నారగాని క్రిష్ణయ్య, మాసిరెడ్డి వెంకటరెడ్డి, సిలివేరు మల్లయ్య, జుజ్జూరి సత్యం, పన్నాల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అర్వపల్లి : సంస్కృతికి ప్రతీక సంక్రాంతి పండుగ అని తెలంగాణ ఉద్యమకారుడు, ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణిశ్రీకాంత్‌రాజు అన్నారు. జాజిరెడ్డిగూడెంలో ఆదివారం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ వెంకటేశ్వర్లు, దాసరి సోమయ్య, ఆచారి, బింగి కృష్ణమూర్తి, జలెందర్, రెంటాల కరుణకుమార్, శిగ శ్రీను పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు

మునగాల : తాడువాయికి చెందిన వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేనేపలి వీరబాబు మణిదీప్ రియల్ ఎస్టేట్ సహకారంతో మండల కేంద్రంతో పాటు తాడువాయి గ్రామపంచాయతీ పరిధిలో 30 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు పలు కూడళ్లలో బెంచీలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

ముకుందాపురంలో..

ముకుందాపురంలో ఆదివారం కోదాడ వాసవీక్లబ్ సహకారంతో రూ.15వేల విలువ గల నాలుగు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసినట్లు వాసవీక్లబ్ జోన్ చైర్మన్ ఇమ్మడి సతీష్‌బాబు, గౌరవ సలహాదారుడు సేకు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పందిరి నాగిరెడ్డి, తాళ్లపాక సైదులు, నర్రా శ్రీపాల్‌రెడ్డి, రాంపంగు సైదులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నూతనకల్ జెడ్పీహెచ్ఎస్ పూర్వవిద్యార్థులు

నూతనకల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–2002 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



కొత్తగూడెంలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ రేణుక, జెడ్పీటీసీ వీరప్రసాద్

అర్వపల్లి : వాటర్ ప్లాంట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్య యాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ కోరారు. మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ తన సొంత డబ్బులు రూ.2లక్షలతో స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కిషోర్ పదవిలో లేకపోయినా నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తున్నారని చెప్పారు. నిత్యం గ్రామాలు తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు లింగంపల్లి రవీందర్, ఉపసర్పంచ్ వాక సుధాకర్, ఆకుల వెంకటనర్సు, గంట రాజు, రావుల వేణు, మురళి, రామసాని శ్రీనివాస్, వాక సైదులు, మేడిపల్లి నర్సయ్య, లింగంపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

హుజూర్‌నగర్ : శారీరక వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందని సీఐ రామలింగారెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా బ్యాడ్మింటన్ క్లబ్ హుజూర్‌నగర్ వారి ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు



అర్వపల్లి : కాసర్లపహాడ్‌లో..



నూతనకల్ : చిల్పకుంట్లలో..

సూర్యాపేట రూరల్ : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. ఆదివారం ఇమాంపేటలో నేతాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా గ్రామీణ కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కిరణ్, నకిరేకంటి యుగేందర్, అన్వేష్, పల్లా నాగయ్య, మేరెడ్డి క్రిష్ణ, ఆంజనేయులు, రవి, సైదులు, శంకర్, కుంచం శంకర్, సురేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : సోదరభావంతో క్రీడలను నిర్వహించుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం కోరారు. సంక్రాంతి సందర్భంగా ఆదివారం కాసర్లపహాడ్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లం లింగరాజు, నల్లగుంట్ల శ్రీనివాస్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : క్రీడలతో యువతలో మానసిక ఉల్లాసం కలుగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్ కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిల్పకుంట్లలో పీవైఎల్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.